సాక్షి
అనంతపురం
సోమవారం ı 9 ı డిసెంబర్ ı 2024



టమాట కిలో రూ.20

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.13 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



నాటి స్ఫూర్తి.. నేటి ఘన కీర్తి

ఎంతో మంది స్వాతంత్య్ర సమరయోధులు నడయాడిన పరిగి మండలంలోని సేవా మందిరం కీర్తి దశదిశలా పాకింది. అదే స్ఫూర్తిని నేటికీ కొనసాగిస్తోంది. 8లో

గరిష్టం/కనిష్టం
35.6°/19.3°

జిల్లా అంతటా ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. చలి వాతావరణం నెలకొంది. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా ఈనెల 11వ తేదీ తర్వాత జిల్లాలో వర్షాలు కురిసే అవకాశముందని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, మొక్కజొన్న పంటలను వెంటనే తొలగించి కంబైన్డ్ హార్వెస్టర్ ద్వారా నూర్పిడి చేసుకోవాలని కోరారు. గత 10 రోజులుగా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షాలు కురిసిన నేపథ్యంలో కంది, పప్పుశనగ రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పప్పుశనగకు ఆశించిన రబ్బరుపురుగు, శనగపచ్చ పురుగు నివారణకు ఎకరాకు 100 మి.లీ 8.33 శాతం ఫ్లూబెండమైడ్ + 5.56 డెల్టామెత్రీన్ మందులు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే కందికి ఆశించిన శనగపచ్చ పురుగు, గూడు పురుగు నివారణకు 4.5 శాతం ఇండాక్సీకార్బ్ + 5.2 శాతం నొవాల్యురాన్ ఎకరాకు 350 మి.లీ మందు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. లేదంటే 9.3 శాతం క్లోరాన్‌ట్రానిలిప్రోల్ + 4.6 శాతం లామ్డాసైహలోత్రీన్ ఎకరాకు 80 మి.లీ మందు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈనెల 15వ తేదీ వరకు వేరుశనగ విత్తుకు అనుకూలమని పేర్కొన్నారు.

శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు



గుంతకల్లు: అయ్యప్పమాలధారుల సౌకర్యార్థం జనవరిలో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్–కొట్టాయం (07065) మధ్య జనవరి 7,14,21,28వ తేదీల్లో రైళ్లు నడుస్తాయన్నారు. హైదరాబాద్ జంక్షన్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4.10 గంటలకు కొట్టాయం చేరతాయన్నారు. తిరిగి అక్కడ సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు హైదరాబాద్ జంక్షన్‌కు చేరుకుంటాయన్నారు. బేగంపేట, లింగంపల్లి, శంకరపల్లి, వికారాబాద్, తాండూరు, శేరం, యాదగిరి, కృష్ణ, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణుగుంట, కాట్పాడి, జోలర్‌పేట్, సేలం, ఈ రోడ్, తిరుపూర్, కోయంబత్తూర్, పాలక్కాడ్, త్రిసూర్, అల్వా, ఎర్నాకులం మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు. ఫస్ట్ క్లాస్, సెకండ్ క్లాస్, త్రీటైర్ ఏసీ, స్లీపర్ క్లాస్‌తో పాటు జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైళ్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా ‘ఎన్‌ఎంఎంఎస్’ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష సాగింది. మొత్తం 3,665 మంది విద్యార్థులకు గాను 3,503 మంది హాజరయ్యారు. ప్రాథమిక కీ సోమవారం www. bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారని డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. ప్రాథమిక కీలో ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 16 సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత స్కూల్ లాగిన్‌లో గ్రీవెన్స్‌లింక్ ద్వారా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. సరైన ఆధారాలున్న అభ్యంతరాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారని స్పష్టం చేశారు.

మట్టిని మింగేస్తున్నారు!



- డీ హీరేహాళ్ మండలంలోని మడేనహళ్లి– లక్ష్మీపురం గ్రామాల మధ్య కొంతకాలంగా అర్ధరాత్రి వేళ భారీగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. బళ్లారి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వీరి ఆగడాలతో ఆ మార్గంలో రహదారులు ఛిద్రమైపోయాయి. ఈ అక్రమాలను స్థానికులు కొందరు ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

- ఇటీవల బొమ్మనహాళ్, డీ హీరేహాళ్ మండలాల్లో మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అక్రమంగా మట్టి, కంకర తరలించే టిప్పర్లు, జేసీబీలను సీజ్ చేశారు. అయితే, కొన్నాళ్లు ఆగిన ఈ చీకటి దందా ఇటీవల మళ్లీ ప్రారంభమైంది.



రాయదుర్గంలో జగనన్న లేఔట్ సమీపాన కొండలో మట్టి తవ్వుతున్న దృశ్యం

సరిహద్దులో ఆగని దోపిడీ

- అర్ధరాత్రి పూట భారీగా తవ్వకాలు
- రోజూ రూ.లక్షలు చేతులు మారుతున్న వైనం
- అన్నీ తెలిసినా చేష్టలుడిగి చూస్తున్న అధికార యంత్రాంగం

రాయదుర్గం: నియోజకవర్గంలో అధికార కూటమి నాయకులు అనకొండల అవతారం ఎత్తారు. కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, కాలువ గట్లపై ఉన్న మన్నును మింగేస్తున్నారు. పచ్చని ప్రకృతిపై పంజా విసిరి.. సహజ వనరులను ధ్వంసం చేస్తున్నారు. మట్టి ముసుగులో రూ.కోట్లు కొల్లగొడుతున్నారు.

చీకటైతే వాలిపోతున్నారు..

కూటమి ప్రభుత్వం ఏర్పడిందే తడవుగా కొందరు గ్రావెల్ దందాకు తెరతీశారు. డీ హీరేహాళ్ మండలం బళ్లారి– బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో అక్రమార్కులు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. చీకటి పడితేచాలు గద్దల్లా వాలిపోతున్నారు. మండలంలోని మడేనహళ్లి– లింగమనహళ్లి మధ్య కొండల్లో రాత్రిళ్లు ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. గుట్టుగా కర్ణాటకలోని బళ్లారికి తరలించేస్తున్నారు. నిత్యం వందల ట్రిప్పుల మట్టి తరలిపోతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఒక్కో టిప్పరు మట్టి బళ్లారిలో రూ.14 వేలకు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ లెక్కన రోజుకు రూ.14 లక్షల నుంచి రూ.15 లక్షలు అక్రమారుల జేబుల్లో చేరుతోంది. ఈ విషయం స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

రాయదుర్గంలో విచ్చలవిడిగా..

రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా అధికార పార్టీ నాయకులు మట్టి దందా చేస్తున్నారనే విమర్శలున్నాయి. రాయదుర్గం పట్టణంలోనూ ఇటీవల మట్టి వ్యాపారం జోరందుకుంది. స్థానిక భంభంస్వామి ఆలయం సమీపాన కొండ గుట్టలో తవ్వకాలు జరుపుతుండగా.. స్థానికులు అడ్డుకున్నారు. దీంతో అక్రమార్కులు కణేకల్లు రోడ్డులోని జగనన్న లేఔట్ సమీపాన సర్వే నంబర్ 176–3లో ఉచ్చప్ప అనే రైతు పొలంలోని 3.20 ఎకరాల కొండపై పడ్డారు. ఇష్టారీతిన మట్టి తవ్వి రూ.లక్షల్లో వెనకేసుకుంటున్నారు. మట్టి టిప్పర్ల ధాటికి సమీపంలోని కేకేటీ దారిలో సీసీ రోడ్డు ఛిద్రమైంది. అక్రమ మట్టి రవాణాపై కలెక్టర్, ఎస్పీ, మైనింగ్ అధికారులు మందలించినప్పుడు కొన్నాళ్లు ఆగిపోతున్న అనకొండలు.. తర్వాత షరామామూలుగా తమ దందా కొనసాగిస్తుండటం గమనార్హం. వీరి ఆగడాల కారణంగా రోడ్లు ఛిద్రమవుతుండటంతో స్థానికులు మండిపడుతున్నారు. ప్రకృతి సంపదను అధికారులు సంరక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



టిప్పర్‌లో తరలుతోన్న మట్టి



రాయదుర్గం కేకేటీ దారిలో దెబ్బతిన్న రోడ్డు

కఠిన చర్యలు తీసుకుంటాం

అనుమతుల్లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు చేపడతాం. మడేనహళ్లి– లక్ష్మీపురం మధ్య జరిపిన తవ్వకాలపై విచారణ చేయిస్తాం. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ, పోలీస్ అధికారుల భాగస్వామ్యంతో మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయిస్తాం.

– వెంకటేశ్వర్లు, మైనింగ్ డీడీ, అనంతపురం

తుది దశకు ఓటరు జాబితా సవరణ

- అధికారులకు 45,544 దరఖాస్తులు
- జనవరి 6న తుది జాబితా ప్రకటన



ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు (ఫైల్)

అనంతపురం అర్బన్: ఓటరు జాబితా సవరణ–2025 ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ ఏడాది ఆగస్టు 10న కార్యక్రమం ప్రారంభమైంది. గత నెల 28 వరకు ఓటరు నమోదు, ఓటు తొలగింపు, వివరాల మార్పునకు సంబంధించి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 45,544 దరఖాస్తులు అందాయి. ఇందులో ఓటు నమోదుకు (ఫారం–6) 22,326 దరఖాస్తులు, ఓటు తొలగింపునకు (ఫారం–7) 8,297 దరఖాస్తులు, ఓటు వివరాల మార్పునకు (ఫారం–8) 14,921 దరఖాస్తులు అందాయి. నిర్దేశించిన గడువులోగా దరఖాస్తులను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్నారు.

24 నాటికి పరిష్కారం..

ఓటరు జాబితా సవరణ–2025కు సంబంధించి ఎన్నికల కమిషన్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం గత నెల 28వ తేదీ వరకు అందిన దరఖాస్తులు, అభ్యంతరాలను ఈనెల 24వ తేదీ నాటికి పరిష్కరిస్తారు. తుది ఓటరు జాబితా ప్రచురణకు ఎన్నికల కమిషన్ అనుమతిని 2025, జనవరి 1వ తేదీన తీసుకుని జాబితా ముద్రణ ప్రక్రియ ప్రారంభిస్తారు. 2025, జనవరి 6వ తేదీన తుది ఓటరు జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ప్రకటిస్తారు.

కాలవ ఇలాకా.. తమ్ముడి మజాకా



ఒకే ఒక ఇంటికి రోడ్డేసిన దృశ్యం

కణేకల్లు: రోడ్ల నిర్మాణాన్ని ఎవరైనా జనావాసాల మధ్య చేపడతారు. అయితే ఓ టీడీపీ నాయకుడు మాత్రం ప్రభుత్వ నిధులతో ఒకే ఒక్క ఇల్లు ఉన్న ప్రాంతంలో రోడ్డు వేయించాడు. ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసుల ఇలాకాలోని కణేకల్లు మండలం బ్రహ్మసముద్రం గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. వివరాలు.. వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బ్రహ్మసముద్రం గ్రామంలో 500 ఇళ్లతో ఇందిరమ్మ కాలనీ ఏర్పాటైంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా.. కాలనీలో రోడ్డు వేయిస్తామని స్థానిక టీడీపీ నాయకుడు ప్రజలకు హామీ ఇచ్చాడు. దీంతో సంతోషపడిన స్థానికులు భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో సొంతంగా డబ్బులు వేసుకుని మురుగు కాలువ పనులు చేసుకొంటున్నారు. ఈ క్రమంలోనే వారి ఆశలపై నీళ్లు చల్లిన సదరు నాయకుడు.. అదే గ్రామం చివర్లో తన మామ ఇంటి వద్ద రోడ్డు వేయించాడు. అది కూడా ఆ ప్రాంతంలో ఆ ఒక్క ఇల్లే ఉండటం గమనార్హం. ఇందుకు ప్రభుత్వ నిధులు రూ.4 లక్షలు ఖర్చు చేశారు. రోడ్లు ఎక్కడ అవసరమో గుర్తించాల్సిన పంచాయతీ,ఇంజినీరింగ్‌శాఖ అధికారులు కూడా టీడీపీ నాయకుడికి వత్తాసు పలకడంపై స్థానికులు మండిపడుతున్నారు. టీడీపీ నాయకుని ‘పచ్చ’పాతాన్ని వివరిస్తూ స్థానికులు కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేయగా వైరలైంది.



రోడ్డు వేస్తారనే ఆశతో కాలువ తవ్వుకున్న ఇందిరమ్మకాలనీవాసులు

ఓమినీ వాహనం దగ్ధం

- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

కణేకల్లు: మండలంలోని నాగేపల్లి గ్రామ శివారులో హెచ్చెల్సీ కాలువ గట్టుపై ఓ ఓమినీ వాహనం ఆదివారం దగ్ధమైంది. అయితే, అదృష్టవశాత్తు ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వివరాలు.. కర్ణాటకలోని దావణగెరకు చెందిన రాజా బక్షీ, సౌకత్‌అలీఖాన్‌లు తమ కుటుంబసభ్యులు ఏడుగురితో కలిసి ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరులోని సర్వసవలీ దర్గాకు ఓమినిలో బయలుదేరారు. ఇటీవల నాగేపల్లి వద్ద హెచ్చెల్సీ బ్రిడ్జి కూలిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు బంద్ చేసి ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేశారు.కొత్తవారు కావడంతో ఈ విషయం తెలీక పాత మార్గం ద్వారానే వెళ్లారు. కూలిన హెచ్చెల్సీ బ్రిడ్జి వద్దకు చేరుకొని అవాక్కయారు. అక్కడున్న వారిని పలకరించగా... హెచ్చెల్సీ కాలువ కుడివైపు గట్టు మీదుగా వెళ్తే మెయిన్‌రోడ్డుకు చేరుకోవచ్చని చెప్పడంతో ఆ దిశగా బయలుదేరారు. మార్గమధ్యంలో రోడ్డుపై వేసిన మొక్కజొన్న సొప్ప సైలెన్సర్,ఇంజిన్ వద్ద చిక్కుకోవడంతో ఓమినీ ఆగిపోయింది. ఓవర్‌హీట్‌తో ఇలా జరిగిందని భావించిన వాహనంలోని వారు.. కొంత సేపటికి స్టార్ట్ అవుతుందని, ఆలోపు కాలకృత్యాలు తీర్చుకుందామని కిందికి దిగారు. ఈ క్రమంలోనే ఒక్కసారిగా ఓమినీలో మంటలు పెద్ద ఎత్తున చెలరేగాయి. వాహనంలో ఉంచిన దుస్తులు, నిత్యావసర సరుకులు, నాలుగు సెల్‌ఫోన్లు దగ్ధమయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



మంటల్లో కాలిపోయిన ఓమినీ

ఎస్కేయూ అథ్లెటిక్స్ చాంపియన్‌గా ‘ఆర్ట్స్ కళాశాల’

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అంతర కళాశాలల అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్‌గా ఆర్ట్స్ కళాశాల జట్టు నిలిచింది. పురుషుల విభాగంలో 65 పాయింట్లు, మహిళా విభాగంలో 62 పాయింట్లు సాధించి మొత్తం 127 పాయింట్లతో అథ్లెటిక్ చాంపియన్‌గా ఆర్ట్స్ కళాశాల క్రీడాకారులు సత్తా చాటారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. పద్మశ్రీ, ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ బి.జెస్సీ క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఏ.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

కందుల కొనుగోళ్లకు రిజిస్ట్రేషన్లు



సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో రైతులు పండించిన కందుల కొనుగోళ్లకు ఆర్‌ఎస్‌కేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పి.పెన్నేశ్వరి సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్ల వ్యవహారంపై ‘ఆర్భాటమేనా.. అమలేదీ?’ శీర్షికతో ఆదివారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించారు. మొక్కజొన్నకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉన్నందున ప్రస్తుతానికి కొనుగోలు కేంద్రం ఇంకా ప్రారంభించలేదన్నారు. ఒకవేళ ధరలు తగ్గితే కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతానికి కందుల కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ధరల స్థిరీకరణ నిధి కింద రోజూ ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కందుల కొనుగోళ్లు ఉంటాయన్నారు. ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతులు ఆర్‌ఎస్‌కేల్లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత రోజువారీ ధర ప్రకారం తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఆదివారం క్వింటా ధర రూ.8,600 ఉందని పేర్కొన్నారు.

మెరుగైన ఫలితాలకు ‘సంకల్ప్’ం

- ఇంటర్‌లో ఉత్తీర్ణత పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమం
- జూనియర్ కళాశాలల్లో వెనుకబడిన విద్యార్థులే లక్ష్యం
- రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్టడీ
- కేర్ టేకర్లుగా జూనియర్ లెక్చరర్లు, ఇతర సిబ్బంది



అనంతపురం కేఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతిలో చదువుకుంటున్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ ఏడాది విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ‘సంకల్ప్–2025’ అనే వినూత్న కార్యక్రమానికి ఇంటర్ బోర్డు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించింది. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఈనెల 2 నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లోనూ ప్రారంభమైన ‘సంకల్ప్’ కార్యక్రమం ఫిబ్రవరి నెలాఖరు దాకా కొనసాగనుంది. పర్యవేక్షణకు జూనియర్ లెక్చరర్లు, ఇతర సిబ్బందిని ‘కేర్ టేకర్లు’గా నియమించారు. జిల్లాలోని 25 ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 7,084 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,757 మంది చదువుతున్నారు.

మూడు గ్రూపులుగా విభజన..

ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటిదాకా నిర్వహించిన వివిధ పరీక్షల్లో వచ్చిన మార్కులు, తరగతి గదుల్లో కనబరుస్తున్న ఆసక్తిని బట్టి విద్యార్థులను గ్రేడింగ్ చేశారు. ప్రతి కాలేజీలో మూడు కేటగిరీలుగా విభజించారు. బాగా చదువుతున్న వారు, అంతంతమాత్రంగా చదువుతున్న వారు, పూర్తిగా వెనుకబడిన విద్యార్థులను ఏ,బీ,సీ గ్రూపులుగా చేశారు. రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్లు నిర్వహిస్తున్నారు.

టైమ్‌టేబుల్..

ప్రతి కాలేజీలోనూ ప్రిన్సిపాళ్లు టైమ్‌టేబుల్‌ను రూపొందించారు. ప్రణాళిక ప్రకారం విద్యార్థులు ఆయా సబ్జెక్టులు చదువుకునేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. విద్యార్థులు ఎక్కువగా వెనుకబడిన సబ్జెక్టులకు ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను కేర్‌టేకర్లు అంచనా వేస్తూ ప్రిన్సిపాళ్లకు నివేదిక సమర్పిస్తున్నారు.

అన్ని కళాశాలల్లోనూ అమలు



ఇంటర్ బోర్డు ప్రకటించిన ‘సంకల్ప్–2025’ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాల్లోనూ అమలు చేస్తున్నాం. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లదే పూర్తి బాధ్యత. అధ్యాపకులు, కేర్ టేకర్లు బాధ్యతగా పని చేయాలి. పూర్తిగా వెనుకబడిన విద్యార్థులపై మరింత దృష్టి సారించి కనీస మార్కులతోనైనా వారిని గట్టెక్కించేందుకు అందరూ కృషి చేస్తున్నాం.

– ఎం. వెంకటరమణనాయక్, ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి

పిల్లలపై చిన్నచూపు..

అనంతపురం మెడికల్: అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని న్యూట్రీషియన్ రీహాబిలిటేషన్ సెంటర్(ఎన్‌ఆర్‌సీ)లో వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరు వైద్యులు ఉదయం, సాయంత్రం షిఫ్టుల్లో విధులు నిర్వర్తించాల్సి ఉన్నా కేవలం ఉదయం 9 గంటలకు రౌండ్స్ వేసుకుని మధ్యాహ్నం 12 గంటలకల్లా ఇళ్లకు వెళ్లిపోతున్నారు. గత నెలలో ఓ వైద్యురాలు, మరో ఉద్యోగి సెలవు తీసుకుని కూడా బయోమెట్రిక్ వేసుకుంటూ ఫుల్‌గా జీతం తీసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. చిన్నారుల విషయంలో వైద్యులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.

దేవుడే దిక్కు..

పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న వారికి న్యూట్రీషియన్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో 14 రోజుల పాటు వైద్యం అందిస్తారు. ఇక్కడ మొత్తం 15 పడకలు అందుబాటులో ఉన్నాయి. పౌష్టికాహార లోపమున్న చిన్నారులకు తీవ్ర జ్వరం, ఫిట్స్ వచ్చినప్పుడు సకాలంలో వైద్యం అందించకపోతే ప్రాణాలకే ప్రమాదం. అయినా, తమ పని తమదే అన్నట్లుగా ఇక్కడి వైద్యులు వ్యవహరిస్తుండటం గమనార్హం. ఓపీకి వెళ్తున్నామని, హెచ్‌ఓడీ వద్దకు వెళ్లాల్సి ఉందని చెబుతూ తప్పించుకుని తిరుగుతున్నట్లు తెలిసింది. ఇక.. ఎన్‌ఆర్‌సీలో సెక్యూరిటీ, అటెండర్ లేకపోవడం మరో సమస్యగా మారింది. అడ్మిషన్‌లో ఉన్న చిన్నారులకు జ్వరం, ఫిట్స్, నిమోనియా వస్తే వారి తీసుకుని మూడో అంతస్తులో ఉన్న చిన్నపిల్లల వార్డుకు స్టాఫ్‌నర్సులే అవస్థలు పడుతూ తీసుకెళ్తున్నారు.



సర్వజనాస్పత్రిలోని ఎన్‌ఆర్‌సీలో ఖాళీగా కనిపిస్తున్న వైద్యుల కుర్చీలు

పని చేయని ఏసీలు, ఫ్యాన్లు..

ఎన్‌ఆర్‌సీలో ఏసీలు, ఫ్యాన్లు పనిచేయడం లేదు. నేషనల్ హెల్త్ మిషన్ కింద ఎన్‌ఆర్‌సీ నిర్వహణ జరుగుతోంది. పర్యవేక్షణ బాధ్యత మాత్రం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఉన్నతాధికారులపై ఉంది. ఎన్‌ఆర్‌సీకి రూ.లక్షల్లో బడ్జెట్ అందుబాటులో ఉంటున్నా, కనీస సౌకర్యాలు కల్పించడంపై అధికారులు దృష్టి సారించడం లేదు.

చర్యలు తీసుకుంటాం

ఎన్‌ఆర్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండరన్న విషయంపై ఆరా తీస్తా. చిన్నారులకందించే సేవలపై నిర్లక్ష్యం వహిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. బయోమెట్రిక్ విషయంపై ఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ రవికుమార్, చిన్నపిల్లల విభాగాధిపతి

క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి


మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: పంటలు సాగు చేసే సమయంలో నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని రైతులకు రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి సూచించారు. విత్తన రకాలపై బీకేఎస్ మండలం రెడ్డిపల్లిలోని కేవీకేలో ఆదివారం రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ... ఆగస్టు – 11న ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా విడుదల చేసిన 109 వ్యవసాయ, పండ్ల తోటల రకాల్లో 54 రకాలను దూరదర్శన్ కృషి చానల్ కార్యక్రమం ద్వారా రైతులకు చూపించారు. పప్పుశనగలో ఎన్‌బీఈజీ-1267, పెసరలో ఎల్‌జీజీ-610, వేరుశనగలో టీసీజీఎస్-1707 రకాలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల భూములకు ఎంతో అనువైనవన్నారు. ఆయా రకాల విత్తనాలను ఎంపిక చేసుకుని పంటల సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శశికళ, డాక్టర్ కిషోర్, డాక్టర్ మాధవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఏక కాలంలో శిక్షణ, పరీక్షలు ఎలా సాధ్యం?

- రాష్ట్రోపాధ్యాయ సంఘం

అనంతపురం ఎడ్యుకేషన్: 'రాష్ట్ర వ్యాప్తంగా 1, 2 తరగతుల టీచర్లకు నాల్గో విడత ఎఫ్‌ఎల్‌ఎన్, ఎంఈఓలు, హెచ్‌ఎంలకు లీడర్‌షిప్ శిక్షణ తరగతులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మరోవైపు విద్యార్థులకు ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రారంభమవుతాయి'. ఇలా ఓవైపు శిక్షణ, మరోవైపు పరీక్షలు ఎలా సాధ్యమవుతాయో చెప్పాలని అధికారులను రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు ప్రశ్నించారు. ఈ మేరకు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, రామాంజనేయులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంఘాలు అభ్యంతరం చెబుతున్నా ఏమాత్రం పరిగణలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే శిక్షణలో ఇద్దరు ఉపాధ్యాయులు మరణించినా తాజాగా ఉదయం 5:30 నుంచి రాత్రి 9 గంటల వరకు శిక్షణ షెడ్యూల్ విడుదల చేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. విద్యార్థులకు ఎస్‌ఏ-1 పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పిల్లలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్న పాఠశాలల్లో ఒకరు శిక్షణకు హాజరైతే అన్ని పరీక్షల నిర్వహణ ఒకరితో ఎలా సాధ్యపడుతుందో అధికారులు ఆలోచించాలన్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత మండల కేంద్రాల్లో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నాటి స్ఫూర్తి.. నేటి ఘన కీర్తి

సందర్భం: రేపు ఏఎం లింగణ్ణ జయంతి


ఏఎం.లింగణ్ణ (ఫైల్)

'విద్యతోనే చైతన్యం వెల్లివిరుస్తుంది. తద్వారా బ్రిటిష్ పాలకుల బానిసత్వ సంకెళ్ల నుంచి సులువుగా బయటపడవచ్చు. ప్రతి భారతీయుడూ విద్యావంతుడు కావాలి' అంటూ నాడు మహాత్మాగాంధీ ఇచ్చిన పిలుపునకు స్పందించిన ఏఎం లింగణ్ణ.. చిన్న వయస్సులోనే స్థాపించిన సేవామందిరం నేటికీ అదే స్ఫూర్తితో కొనసాగుతోంది. కేవలం 'విద్యతోనే చైతన్యం' నినాదానికే పరిమితం కాకుండా మహాత్మాగాంధీ, ఏఎం లింగణ్ణ ఆశయాలకు వారధిగా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నారు. కొందరు తమ స్వార్థం కోసం సంస్థలు స్థాపించి లక్ష్యం నెరవేరిన తర్వాత సేవకు స్వస్తి పలకడం చరిత్ర చెప్పిన సత్యం. అలాంటి సంస్థలకు భిన్నంగా ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో ప్రారంభమైన సేవామందిరం... సామాజిక సేవే కొలబద్ధగా.. మానవీయ ఉపకారమే మార్గంగా.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ప్రతిఫలంగా .. నేటికీ కొనసాగుతోంది.

- 6 దశాబ్దాలుగా జాతీయ సమైక్యతా భావాన్ని చాటుతున్న సేవామందిరం
- నిత్యం టోపీధారణతో పాఠశాలకు విద్యార్థులు
- మహాత్మాగాంధీ, ఏఎం లింగణ్ణ ఆశయాలకు వారధిగా నిలుస్తున్న వైనం


యోగా చేస్తున్న విద్యార్థులు


తెల్లని దుస్తులు, టోపీ ధారణతో హాజరైన విద్యార్థులు

పరిగి: ఎంతో మంది దేశ స్వాతంత్ర్యోద్యమ నాయకులు కాలు మోపిన పరిగి మండలంలోని సేవామందిరానికి చరిత్ర పుటల్లో తనకంటూ ప్రత్యేకత ఉంది. నాడు బ్రిటీష్ పాలకులను దేశం నుంచి సాగనంపడానికి ప్రతి భారతీయుడూ విద్యావంతుడవ్వాలన్న మహాత్మగాంధీ పిలుపుతో అప్పటి ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు ఏఎం లింగణ్ణ స్థాపించిన సేవా మందిరం నాటి నుంచి నేటి వరకూ అదే ఆశయ స్ఫూర్తితో కొనసాగుతోంది. నాణ్యమైన విద్యతో పాటు చైతన్య దీప్తిని నిర్వాహకులు రగిలిస్తున్నారు.

స్ఫూర్తిదాయక జీవనం..

1905, డిసెంబరు 10న కర్ణాటకలోని శిరా తాలూకా పట్టనాయకహళ్లిలో మరియమ్మ, అట్టణ్ణ దంపతులకు ఏఎం లింగణ్ణ జన్మించారు. కంబళ్ల వ్యాపారంతో జీవనం సాగించే వారు బతుకు తెరువులో భాగంగా హిందూపురం ప్రాంతానికి వలస వచ్చారు. అక్కడి సత్యనారాయణపేటలో నివాసముంటూ సోమేశ్వర కంబళ్ల సొసైటీని ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకున్న నాటి రోజుల్లో మహాత్మాగాంధీ పిలుపుతో చైతన్యవంతుడైన ఏఎం లింగణ్ణ ప్రజలను విద్యావంతులను చేయాలన్న ఏకైక లక్ష్యంతో నాడు దయ్యాలదిన్నెగా పిలవబడుతున్న ప్రాంతంలో సేవా మందిరం పేరుతో ఓ విద్యాసంస్థను నెలకొల్పారు. జాతిపిత ఆశయాలకు అనుగుణంగా సేవామందిరం నిర్మాణానికి చక్రవర్తి రాజగోపాలాచారి శంకుస్థాపన చేశారు.

ఆరు దశాబ్దాల ప్రస్థానం..

1941లో గాంధీజీ పిలుపుమేరకు సత్యాగ్రహంలో పాల్గొన్న ఏఎం లింగణ్ణ 6 నెలల జైలు జీవితం గడిపారు. ఆ తర్వాత 1943 నుంచి సేవామందిరం వేదికగా రాత్రి వేళల్లో వయోజనులకు విద్యాబుద్ధులు నేర్పి, వారిలో చైతన్యం తీసుకువచ్చారు. దేశ స్వాతంత్ర్యానంతరం సేవామందిరంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు స్థలాన్ని ఏఎం లింగణ్ణ కేటాయించారు. ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు అప్పటి నిబంధనల మేరకు కార్పస్ ఫండ్‌ను కర్ణాటకలోని తన సొంతూరిలో ఉన్న స్థిరాస్తిని ఏఎం లింగణ్ణ, చౌడమ్మ దంపతులు విక్రయించి చెల్లించారు. దీంతో 1962లో సేవామందిరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటైంది. విద్యాభివృద్ధికి ఏఎం లింగణ్ణ చేసిన సేవలను స్మరిస్తూ నాటి నుంచి నేటి వరకూ ఆయన తరహాలోనే తలపై ఖద్దరు టోపీ, శరీరంపై తెల్లటి దుస్తులు ధరించే సంప్రదాయాన్ని విద్యార్థులు పాటిస్తూ వస్తున్నారు.. దేశంలోని ఏ ప్రభుత్వ పాఠశాలలోనూ ఇలాంటి సంప్రదాయం లేదు.

సంప్రదాయాన్ని గౌరవిస్తున్నాం



దశాబ్దాలుగా పాఠశాలలో విద్యార్థులు తలపై తెల్లని ఖద్దరు టోపీ, తెల్లటి దుస్తులు ధరించడాన్ని ఓ సంప్రదాయంగా గౌరవిస్తున్నాం. బాలురు తప్పనిసరిగా టోపీ ధరించే పాఠశాలకు వస్తారు. ప్రాంగణంలో ఉన్నంతసేపూ తప్పని సరిగా టోపీ ధరించే ఉంటారు. ఏఎం లింగణ్ణలోని జాతీయ భావాన్ని చాటుతున్నందుకు గర్వంగా ఉంది.

– శ్రీలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు (ఎఫ్‌ఏసీ)

ఎంతో ప్రశాంతంగా ఉంటుంది



ఏఎం లింగణ్ణ తాతయ్యకు గుర్తుగా రోజూ తెల్లటి దుస్తులు, తలపై టోపీ ధరించడంతో మనసుకు ఎంతో ప్రశాంతంగా ఉంటోంది. ప్రార్థన సమయం నుంచి సాయంత్రం వరకూ గౌరవప్రదమైన సంప్రదాయాన్ని పాటిస్తున్నాం. స్థానికంగా ఉన్న టైలర్ల వద్ద టోపీని కుట్టించుకుంటాం.

– ఎంఎస్.యశ్వంత్‌రెడ్డి, 10వ తరగతి

వెలితిగా ఉంటుంది



టోపీ ధరించకుండా పాఠశాలకు వస్తే ఏదో వెలితిగా ఉంటుంది. ఏన్నో ఏళ్లుగా పాఠశాలలో పాటిస్తున్న సంప్రదాయం అలవాటుగా మారిపోయింది. టోపీ ధరిస్తే ఏదో తెలియని జాతీయతా భావం కలుగుతుంది. శుక్రవారం మాత్రం తెల్లని టోపీతో పాటూ వైట్ అండ్ వైట్ యూనిఫారంతో వస్తాం.

– కుషామంత్, విద్యార్థి, 10వ తరగతి

రాచపాలెం రచనలు హేతుబద్ధం

- వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ వినోదిని


ఆచార్య రాచపాలెం దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి రచనలు హేతుబద్ధమని వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య ఎం.ఎం.వినోదిని కొనియాడారు. స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో ఆత్మీయ జీవన సాఫల్య పురస్కారాన్ని డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డికి ఆదివారం నిర్వాహకులు అందించారు. అలాగే ఆయన రాసిన 'అనంత కవిత్వం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్థానిక ఎన్జీఓ హోమ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య వినోదిని హాజరై, రాచపాలెం రచనా శైలిలోని ప్రత్యేకతను వివరించారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన సీనియర్ రచయిత డాక్టర్ శాంతినారాయణ మాట్లాడుతూ... రాచపాలెం రచనల్లో హేతబద్ధత, శాస్త్రీయ దృక్పథం వంటి భావాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కవి రాజారాం, పురస్కార ప్రదాత చంద్రశేఖరశాస్త్రి, తదితరులు మాట్లాడుతూ... రాచపాలెం రచించిన అనంత కవిత్వం అద్భుతంగా ఉందన్నారు. అందరూ చదవాల్సిన పుస్తకంగా అభిప్రాయపడ్డారు. అనంతరం రాచపాలం దంపతులను ఘనంగా సత్కరించి, పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో సీనియర్ కవులు రాధేయ, ఏలూరు యంగన్న, తరిమెల అమరనాథరెడ్డి, జెట్టీ జైరాం, విశాలాంధ్ర ఈరన్న, దాసరి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సార్ చెప్పారు... నిర్మాణ పనులు ఆపండి

- వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి భవన నిర్మాణ పనులను అడ్డుకున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది


పనులు ఆపేయాలంటూ రమేష్‌రెడ్డికి సూచిస్తున్న పోలీసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి చేపట్టిన భవన నిర్మాణ పనులను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, ముందస్తు సమాచారం లేకుండా తాడిపత్రి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకున్నారు. ఎందుకు అడ్డుకుంటున్నారని రమేష్‌రెడ్డి ప్రశ్నిస్తే సార్ చెప్పారంటూ దాటవేశారు. వివరాలు... తాడిపత్రిలోని పుట్లూరు రోడ్డులో ఉన్న తన సొంత స్థలంలో రమేష్‌రెడ్డి నూతనంగా భవన నిర్మాణాలను చేపట్టారు. ఇందుకు సంబంధించి మున్సిపాలిటీ అనుమతులు సైతం పొందారు. నిబంధనల మేరకే నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ క్రమంలో గత 20 రోజులుగా వివిధ కారణాలు చెబుతూ నిర్మాణ పనులను టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకుంటూ వచ్చారు. శనివారం సైతం నిర్మాణ పనులను అడ్డుకోవడంతో రమేష్‌రెడ్డి అధికారులను నిలదీశారు. సార్ చెప్పాడంటూ సమాధానమివ్వడంతో వెంటనే మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణతో ఫోన్‌లో సంప్రదించారు. నిర్మాణ పనులను ఏ కారణం చేత ఆపమంటున్నారో నోటీసు ద్వారా సమాచారం ఇస్తే సరిపోతుందన్నారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు వెనుదిరిగి వెళ్లారు. తిరిగి ఆదివారం ఉదయం అక్కడకు పోలీసులతో చేరుకుని తమ సార్ చెప్పాడంటూ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీంతో సదరు అధికారికి రమేష్‌రెడ్డి ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. అర్బన్ సీఐ సాయిప్రసాద్ జోక్యం చేసుకుని రెండు రోజుల పాటు నిర్మాణాలను ఆపేయాలని రమేష్‌రెడ్డిని కోరారు. అయితే మున్సిపల్ అధికారులు ఆమోదించిన ప్లాన్ ప్రకారమే తాను నిర్మాణ పనులు కొనసాగిస్తున్నానని, సరైన కారణం చెప్పకుండా పనులు ఆపేయమంటే ఎలాగంటూ రమేష్‌రెడ్డి ప్రశ్నించారు.

పోలీసుల పల్లె నిద్ర

- ఎస్‌ఐ మొదలు ఉన్నతాధికారుల వరకూ రాత్రంతా గ్రామాల్లోనే
- సమస్యలు తెలుసుకుని ప్రత్యేక యాప్‌లో నమోదు


గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

అనంతపురం: అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు సమస్యాత్మక గ్రామాల్లో ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు పోలీసుల పల్లె నిద్ర కార్యక్రమం మొదలైంది. జిల్లాలో సమస్యాత్మకంగా ఇప్పటికే 63 గ్రామాలను గుర్తించగా... ఇందులో తొలిరోజు ఆదివారం రాత్రి యల్లనూరు మండలం వెన్నపూసపల్లి, తాడిపత్రి మండలం వీరాపురం, ఉరవకొండ మండలం బూదిగవి, విడపనకల్లు మండలం ఆర్.కొట్టాల, పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరు, పుట్లూరు మండలం చింతకుంట గ్రామంలో ఆయా ప్రాంత ఎస్‌ఐ స్థాయి మొదలు... ఉన్నతాధికారుల వరకూ పల్లె నిద్ర చేశారు. ఇందులో భాగంగా గ్రామస్తులో రాత్రి గ్రామసభ ఏర్పాటు చేసి, సమస్యలపై ఆరా తీశారు. అసాంఘిక శక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా వ్యవహరించాలని గ్రామస్తులకు సూచించారు. గంజాయి, తదితర మత్తు పదార్థాల జోలికెళ్లకుండా ఉండాలన్నారు. చట్టాలు కఠినంగా ఉన్నాయని.. ఒక్కసారి కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు నాశనమవుతాయని హెచ్చరిస్తున్నారు.గ్రామాల వారీగా వివరాలను సేకరించి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ఏదైనా సమస్య తలెత్తినా... ఘటన జరిగినా వెంటనే స్పందించే కార్యాచరణకు ఈ డేటా దోహదపడనుంది. అనంతరం సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మహిళా రక్షణ చట్టాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, డయల్ -100, 112 తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో నెలకొన్న చిన్నపాటి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపారు.

నీలూరు చర్చి స్కూల్‌లో చోరీ


స్కూల్‌కు వేసిన కన్నం

పామిడి: మండలంలోని నీలూరు సీఎస్‌ఐ చర్చి స్కూల్‌లో చోరీ జరిగింది. శనివారం అర్ధరాత్రి స్కూల్ వెనుక ఉన్న కిటికీ కింద పెళ్ల తొలగించి కన్నం వేసిన దుండగులు లోపలికి ప్రవేశించి బీరువాను ధ్వంసం చేశారు. అందులోని సామగ్రిని చెల్లాచెదురు చేసి, రికార్డులతో పాటు స్టీలు సామగ్రిని అపహరించారు. టీవీ, రెండు టేప్ రికార్డ్‌లను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న స్కూల్ హెచ్‌ఎం సంజీవకుమార్, చర్చి సభ్యులు అబ్రహం, ప్రకాష్ అక్కడకు చేరుకుని పరిశీలించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాడిపత్రిలో నియంత పాలన

- జేసీ వర్గీయుల దౌర్జన్యాలు శ్రుతిమించాయి
- సీపీఐ నాయకుల ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి అర్బన్: కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తాడిపత్రిలో నియంత పాలన సాగుతోందని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ విమర్శించారు. ముఖ్యంగా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గీయుల దౌర్జన్యాలు ఎక్కువయ్యాయన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ జిల్లాలోని కొండాపురం, ఏటూరు, బెడుదూరు ప్రాంతాల్లోని రీచ్‌ల నుంచి ఇసుకను రాయల్టీ చెల్లించి టిప్పర్లలో జిల్లాతో పాటు నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తాడిపత్రి మీదుగా తరలిస్తుండగా.. వాటిని జేసీ వర్గీయులు అడ్డుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. టిప్పర్లలోని ఇసుకను దౌర్జన్యంగా జేసీ వర్గీయుల కాంట్రాక్ట్ పనులకు తరలించుకుపోవడం శోచనీయమన్నారు. తాడిపత్రిలో నియంత పాలన సాగుతోందనడానికి ఇదే నిదర్శనమన్నారు. సమావేశంలో వృత్తిదారుల సంఘం నియోజకవర్గ కార్యదర్శి సాలవేముల సూరి, సీపీఐ నాయకులు రామాంజినేయులు, రత్నమయ్య, నాగేంద్ర, ఏఐటీయూసీ నాయకులు ఉమాగౌడ్, రమణ, అబ్రహాం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

● ఆట విడుపు.. వినోదాల పంచ్‌లు

అనంతపురంలోని పరేడ్ మైదానం వేదికగా ఆదివారం పోలీసులకు నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆహ్లాదంతో పాటు వినోదాన్ని పంచాయి. కళ్యాణదుర్గం జట్టుపై తాడిపత్రి పోలీసు జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఫోర్లు, సిక్స్‌లతో హోరెత్తించారు. ఏఆర్ ఎస్‌ఐ జాఫర్, డీఎస్పీ నీలకంఠారెడ్డి, అసోసియేషన్ సభ్యులు, తదితరులు స్వయంగా హాజరై, క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఏఆర్ ఎస్‌ఐ జాఫర్ తనదైన శైలిలో కామెంటరీ చెప్పి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రేయింబవళ్లు శ్రమించిన ఖాకీలు కాస్త రిలాక్స్ అయ్యేందుకు వారం రోజుల పాటు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


ట్రాఫిక్ డ్యూటీ కాదన్నో : బంతిని బాది పరుగు తీయకుండా క్రీజు వద్దనే నిలబడిన కళ్యాణదుర్గం బ్యాటర్


బంతిని వదిలేసి: భూమిని బాదేసిన తాడిపత్రి బ్యాటర్


మరీ ఇంత టాలెంటెడ్‌గా ఉన్నారే : బౌండరీ లైన్ వద్ద బంతిని వదిలేసి ముందుకెళ్లిపోయిన ఫీల్డర్


విజేత తాడిపత్రి పోలీసు జట్టుతో ఏఆర్ డీఎస్పీ నీలకంఠారెడ్డి, ఎస్‌ఐ జాఫర్

వ్యక్తి అదృశ్యం


రాఘవ (ఫైల్)

నార్పల: మండల కేంద్రానికి చెందిన రాఘవ(44) కనిపించడం లేదు. పోలీసులు తెలిపిన మేరకు... డ్రైవింగ్ వృత్తిలో కొనసాగుతున్న రాఘవకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనేవాడు. కరోనా విపత్కర పరిస్థితుల్లో తన వాహనంలో కరోనా బాధితులను ఉచితంగా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి చేర్చాడు. ఇటీవల నార్పలలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో తాను నివాసముంటున్న ఇల్లు దెబ్బతినింది. దీంతో అధికారుల అనుమతితో ఇంటిని తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించుకున్నాడు. అయితే కాంప్లెక్స్ నిర్మాణ దశలోనే చాలా మంది నుంచి వ్యతిరేకత వచ్చింది. ప్రస్తుతం ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తన భార్యకు సెల్‌ఫోన్ ఇచ్చి బయటకు వెళ్లొస్తానంటూ చెప్పిన వ్యక్తి చీకటి పడినా ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై పలువురికి తెలపడంతో రాఘవ సన్నిహితులు చుట్టుపక్కల గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

ఏఆర్ జట్టు గెలుపు

అనంతపురం: పోలీస్ పరేడ్ మైదానం వేదికగా ఆదివారం ప్రారంభమైన జిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్ మీట్‌లో భాగంగా తొలిరోజు జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో అనంతపురం అర్బన్ సబ్‌డివిజన్ జట్టుపై ఏఆర్ విభాగం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం అర్బన్ సబ్ డివిజన్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 110 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఏఆర్ జట్టు 12.5 ఓవర్లలో 114 పరుగులు చేసి గెలుపొందింది. ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్‌ఐ రాముడు, ఎస్‌ఐ రుష్యేంద్రబాబు, ఆర్‌ఎస్‌ఐలు జాఫర్, మగ్బూల్, రమేష్ నాయక్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్ ,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మిక్స్‌డ్ జెండర్ టోర్నీ లీగ్ విజేత 'రాప్తాడు'



ఆనందంలో క్రీడాకారులు

అనంతపురం: ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం జరిగిన మిక్స్‌డ్ జెండర్ క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్ విజేతగా రాప్తాడు, రన్నర్స్‌గా ఆత్మకూరు జట్లు నిలిచింది. ఫుట్‌బాల్ పోటీల్లో విజేతగా హిందూపురం టౌన్, హాకీ పోటీల్లో విజేతగా కళ్యాణదుర్గం జట్లు నిలిచాయి. అనంతరం క్రికెట్ ఫైనల్ లీగ్ మ్యాచ్ రాప్తాడు, ఆత్మకూరు జట్ల మధ్య జరిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఆత్మకూరు జట్టు 9 వికెట్లు నష్టపోయి 56 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రాప్తాడు జట్టు 11.2 ఓవర్లలోనే రెండు వికెట్లు నష్టపోయి 57 పరుగులు సాధించి విజయకేతనం ఎగరేసింది.

బీఈడీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని క్యాంపస్ కళాశాలలో బీఈడీ కోర్సులో మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సోమశేఖర్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 9న కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంది. ఎడ్‌సెట్-2024లో అర్హత సాధించి, కోర్సు పూర్తి చేయాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 11 గంటలకు ఎస్కేయూలోని బీఈడీ కళాశాలకు నేరుగా హాజరుకావాలి. అడ్మిషన్ పొందిన వారు కోర్సు ఫీజును అదే రోజు చెల్లించాల్సి ఉంటుంది. స్పాట్ అడ్మిషన్‌కు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు?

తాడిపత్రి టౌన్/రూరల్: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఈ నెల 7న నంద్యాల జిల్లా కనకాద్రిపల్లికి చెందిన నడిపి కంబగిరి అనుమానస్పందంగా మృతి చెందిన విషయం తెలిసిందే.. అయితే 24 గంటలు గడవక ముందే పోలీసులు అనుమానస్పద మృతిని హత్యగా ధ్రువీకరించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పుట్లూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో ఇనుప రాడ్‌తో తలపై మోది హతమార్చినట్లుగా తెలిసింది. కాగా, అనుమానాస్పద మృతి ఘటనపై ఆదివారం రాత్రి ఆర్‌ఫీఎఫ్ డీఎస్పీ అనిల్‌కుమార్ సింగ్ విచారణ జరిపారు.

క్లుప్తంగా

మాజీ సర్పంచ్ వెంకటేష్‌కు నివాళి



మాజీ సర్పంచ్ వెంకటేష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వడ్డే వెంకటేష్ శనివారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి ఆదివారం వడ్డుపల్లి గ్రామానికి చేరుకున్నారు. వెంకటేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌గా వెంకటేష్ ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఓబిరెడ్డి, శివారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు నివాళులర్పించారు.

బుక్కచెర్లలో రేపు రెవెన్యూ సదస్సు

రాప్తాడు: భూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10వ తేదీ మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయకుమారి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సుకు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సూచించారు. బుక్కచెర్ల రెవెన్యూ గ్రామ ప్రజలు ఏమైనా భూ సమస్యలు ఉంటే వినతిపత్రాలు అందజేయాలన్నారు.

రెడ్డి వివాహ పరిచయ వేదిక



వివాహ పరిచయ వేదికకు హాజరైన యువతీ యువకుల తల్లిదండ్రులు

రాప్తాడు రూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత రెడ్డి వివాహ పరిచయ వేదికకు 90 కుటుంబాలు హాజరయ్యాయి. ఆయా కుటుంబాలు యువతీ, యువకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేటలోని సంఘం కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బెంగళూరు, కర్నూలు, ప్రొద్దుటూరు, కడప, మడకశిర, గుంతకల్లు, తాడిపత్రి, హిందూపూరం, పెనుగొండ తదితర ప్రాంతాల నుంచి యువతీ, యువకుల తల్లిదండ్రులు హాజరయ్యారు. కార్యక్రమంలో రాయలసీమ రెడ్డి జనసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రొద్దం సురేష్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు చిన్నరాశి చంద్రమౌళి రెడ్డి, సెక్రటరీ దుబ్బ కిషోర్ రెడ్డి, ట్రెజరర్ తోపుదుర్తి రామకృష్ణా రెడ్డి, రిటైర్డ్ ఎస్‌ఐ వెంకట శివారెడ్డి, రిటైర్డ్ వీఆర్‌ఓ రమణారెడ్డి, యన్నం భాస్కర్‌రెడ్డి, దయానంద రెడ్డి, శివానంద రెడ్డి పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాలు చదివించాలి



భగవద్గీత కంఠస్థ పోటీలకు హాజరైన విద్యార్థులు

అనంతపురం కల్చరల్: భగవద్గీత సకల సమస్యలకు పరిష్కారమార్గం. తల్లిదండ్రులు పిల్లలను జ్ఞానవంతులుగా చేయడానికి గీతా శ్లోకాలు చదివించాలని ఆర్డీఓ కేశవ నాయుడు అన్నారు. ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో భగవద్గీత కంఠస్థ శ్లోకాల పోటీలు జరిగాయి. మూడు విభాగాల్లో నిర్వహించిన పోటీలకు అధిక సంఖ్యలో చిన్నారులు హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. గీతాజయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో వేర్వేరు విభాగాల్లో విష్ణుప్రియ, హేమచలం, శ్యామల, జ్ఞానకీర్తి, లహరి, రిషిక, నారాయణప్ప, బయన్న నల్లపరెడ్డి తదితరులు విజేతలుగా నిలిచారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ధర్మప్రచార మండలి అధ్యక్షుడు శ్రీపాదవేణు, సీనియర్ న్యాయవాది నాగేశ్వరి, టీటీడీ ప్రోగ్రాం కన్వీనర్ బాబు, పండిట్ వేణు, ధార్మిక సంఘాల ప్రతినిధులు నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

గార్లదిన్నె: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అనంతపురం డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఆది వారం ఏఈ మాట్లాడుతూ అనంతపురంలోని ఎస్‌ఈ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అవగాహన సదస్సు నిర్వహిస్తారన్నారు. వివిధ గ్రామాల్లో గృహ అవసరాలకు, వ్యవసాయానికి విద్యుత్ వినియోగిస్తున్న రైతులు ఏమైనా సమస్యలు ఉంటే విద్యుత్ పరిష్కార వేదికలో అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు.

అంతా నష్టమే..!

- తుపాను ప్రభావంతో కంది, ఆముదం, పప్పుశనగకు దెబ్బ
- ఆత్మకూరును కరువు మండలంగా ప్రకటించని ప్రభుత్వం
- నష్టాల పాలవుతున్న అన్నదాతలు
- 'అన్నదాత సుఖీభవ' ఊసెత్తని కూటమి ప్రభుత్వం



వర్షాలకు పూర్తిగా తడిసిపోయిన వేరుశనగ (ఫైల్)



వర్షాలకు దెబ్బతిన్న ఆముదం పంట



తుపానుకు కంది పూత రాలిపోయిన దృశ్యం

ఆత్మకూరు: ఈ ఏడాది మండల రైతులకు అంతగా కలసి రాలేదని చెప్పొచ్చు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలన్నీ దెబ్బతినడంతో నష్టాలపాలయ్యారు. మండలంలో వర్షం బాగా కురిసిందనే సాకుతో ప్రభుత్వం ఆత్మకూరును కరువు మండలంగా ప్రకటించ లేదు. వర్షాలు ఎక్కువగా కురవడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అటు ప్రభుత్వం కూడా ఏ రకంగాను రైతులను ఆదుకోవడం లేదు. రెండు నెలల వరకూ తొలగించిన వేరుశనగ వర్షాలకు పొలాల్లోనే కుళ్లిపోయింది. తుపాను ప్రభావానికి ప్రస్తుతం కంది, ఆముదం, పప్పుశనగ పంటలకు చీడపీడలు ఆశించాయి. కంది పంట పూత దశ నుంచి కాయ దశకు చేరకునే సమయంలో పూత రాలిపోయింది. కంది కాయలకు కాస్త పురుగులు ఆశించడంతో పంట పూర్తిగా దెబ్బ తింటోంది. ఈ ఏడాది ఆముదం కూడా ఆశించిన స్థాయిలో లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు వస్తే పప్పుశనగ దెబ్బతింటుందని లబోదిబోమంటున్నారు. కనీసం పంటలకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని అన్నదాతలు వాపోతున్నారు.

కలసిరాని వేరుశనగ..

ఖరీఫ్ సీజన్‌లో భాగంగా మండల వ్యాప్తంగా దాదాపు 15 వేల హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. ఒక ఎకరాలో వేరుశనగ సాగు చేయడానికి రైతులకు రూ.60 వేల వరకూ ఖర్చు అవుతుంది. విత్తనాలు వేసినప్పటి నుంచి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్న రైతులకు నష్టం మిగిలింది. ఈ విషయంలో ప్రభుత్వం రైతులకు ఎలాంటి సహాయం అందించ లేదు. ఇక మండల వ్యాప్తంగా 5 వేల ఎకరాల్లో కంది, 4 వేల ఎకరాల్లో ఆముదం పంట సాగులో ఉంది. తుపాను ప్రభావంతో కంది పూత దెబ్బతింది. మందులు పిచికారీ చేసినా తెగుళ్లు తగ్గలేదని రైతన్నలు చెబుతున్నారు.

పప్పుశనగ పరిస్థితి దారుణం

మండల వ్యాప్తంగా 3 వేల ఎకరాల వరకు నల్లరేగడి భూములు ఉన్న రైతులు పప్పుశనగ పంటను సాగు చేశారు. మండలంలో ఆత్మకూరు, పి.యాలేరు, కొత్తపల్లి, ముట్టాల, గొరిదిండ్ల గ్రామాల రైతులు ఎక్కువగా ఈ పంటను సాగు చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై పప్పుశనగ విత్తనాలు అందించినప్పటికీ రైతులు మాత్రం సాగు చేయడంలో ఆసక్తి చూపలేకపోయారు. ప్రస్తుతం పప్పుశనగకు తెగుళ్లు ఆశించడంతో మందులు పిచికారీ చేస్తూ పంటను కాపాడుకుంటున్నారు.

రైతులను మోసం చేసిన ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయినా రైతులకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం అందజేయలేదు. అంతేకాకుండా ఖరీఫ్ సీజన్‌లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నా.. నష్టపరిహారం అందించిన దాఖలాలు లేవు. పెట్టుబడులు రాకపోయినా ప్రభుత్వం ఆత్మకూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం తీవ్ర అన్యాయమని రైతులు మండిపడుతున్నారు. పంటలకు పరిహారం అందించి అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నష్టపరిహారం అందించాలి

ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులందరికీ వెంటనే పంట నష్టపరిహారం అందించాలి. అంతేకాకుండా ఆత్మకూరును కరువు మండలంగా ప్రకటించాలి. రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలి. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి. రైతులను అన్ని విధాలా ఆదుకోవాలి.
– రామకృష్ణ, సనప

పెట్టుబడి కూడా అందలేదు

ఈ ఏడాది వేరుశనగ, కంది పంటలను సాగు చేశాం. వేరుశనగ తొలగించిన ప్పుడు వర్షాలు కురవడంతో పంట పూర్తిగా తడిసిపోయింది. పశుగ్రాసం కూడా దక్కలేదు. ప్రస్తుతం కంది పంట తుపాను ప్రభావంతో పూత మొత్తం రాలిపోతోంది. కాయలు కాస్త పురుగులు పట్టి పాడైపోతున్నాయి. ఇంత వరకు పంటలకు పెట్టిన పెట్టుబడి కూడా అందలేదు.
– కొండారెడ్డి, ఆత్మకూరు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాఠశాలలో నూతనంగా నిర్మించిన గేట్, ముఖద్వారం వద్ద 1992-93 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరడంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ప్రస్తుతం తమ బ్యాచ్‌లో 80 మంది పూర్వ విద్యార్థుల వరకు ఉన్నామని తెలిపారు. చదివిన పాఠశాలకు ఏదైనా చేయాలన్న సంకల్పంతో రూ.3.50 లక్షలతో పాఠశాలకు ముఖద్వారం, నూతన గేట్‌ను బ్యాచ్‌కు గుర్తుగా నిర్మించినట్లు పేర్కొన్నారు.

శాంతియుత ధర్నాకు తరలిరండి

అనంతపురం కల్చరల్: రాష్ట్ర సమాచార కమిషనర్ల పనితీరుకు నిరసనగా ఫైట్ ఫర్ రైట్స్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన ఉదయం విజయవాడలోని ధర్నా చౌక్‌లో శాంతియుత ధర్నా నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోప్యంగా సాగుతున్న ప్రతి పనిని ప్రశ్నిస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని మండిపడ్డారు. ధర్నాకు అనంత నుంచి స.హ.చట్టం కార్యకర్తలు, యాక్టివిస్టులు, ఉద్యమకారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు తరలిరావాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహిమాం





అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు, మంజునాథ స్వామి

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేపట్టారు. తొలుత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామి వారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో కాలసర్పదోష నివారణ హోమాలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించి నవగ్రహ ప్రదక్షిణలు చేశారు. అంతేకాకుండా ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి అభిషేకాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి..

అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ఈఓ బాబు, అర్చకులు ఎమ్మెల్యేకు స్వామి వారి చిత్రపటం ఇచ్చి, ప్రసాదాలు అందజేశారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

రాప్తాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ విజయకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అర్జీదారులు కార్యాలయానికి వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

నల్లలమ్మ ఆలయంలో పూజలు

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో వెలసిన నల్లలమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాక ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజావ్యతిరేక పాలనపై పోరాటం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

అనంతపురం అర్బన్: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజల పక్షాన నిలిచి సీపీఎం పోరాటాలు సాగిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. విద్యుత్ చార్జీల భారంపై ఉద్యమం సాగిస్తామన్నారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లోని ముస్కిన్ ప్రాంగణంలో నగర సీపీఎం 8వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పార్టీ ప్రతినిధుల సమావేశంలో రాంభూపాల్ మాట్లాడారు. పాలకులు తీసుకునే ప్రజావ్యతిరేక నిర్ణయాలపై ప్రజలు తక్షణం కమ్యూనిస్టుల వైపు చూస్తారన్నారు. ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకించిన టీడీపీ అధికారంలోకి రాగానే చార్జీల భారం ప్రజలపై మోపిందన్నారు. దీనిపై ప్రజల ఆగ్రహాన్ని ఎవరూ ఆపలేరన్నారు.

రాజ్యాంగానికి ముప్పు..

బీజేపీ పాలనలో రాజ్యాంగానికి ముప్పు ఏర్పడిందన్నారు. కార్పొరేట్‌లను అడ్డుపెట్టుకుని హిందుత్వాన్ని ముందుకు తెచ్చి మతతత్వాన్ని బీజేపీ రెచ్చగొడుతుందన్నారు. రాష్ట్రంలోని సహజ వనరులను రాష్ట్ర పాలకుల ద్వారా బడా కంపెనీలకు కేంద్రం కట్టబెడుతోందన్నారు. దేశంలో ధన రాజకీయాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. ఎన్నికల బాండ్లను అనుమతించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బీజేపీ అపహాస్యం చేసిందన్నారు. మౌలిక సమస్యలను పరిష్కరించకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతపరమైన అంశాలను తెరపైకి తెస్తున్నాయన్నారు. రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలను లొంగదీసుకుని దేశ వ్యాప్తంగా తన ఎజెండాను బీజేపీ అమలు చేస్తుందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఇందుకు బీజేపీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్ర కుమార్, బాల రంగయ్య, సావిత్రమ్మ, నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్‌డీ నాయుడు, సభ్యులు గోపాల్, వెంకట నారాయణ, ప్రకాష్, వలి, తదితరులు పాల్గన్నారు.

కాంప్లెక్స్ సమస్య పరిష్కరించాలి



షకీల్‌షఫీపై మండిపడుతున్న సాలార్ బాషా

అనంతపురం కల్చరల్: ముస్లిం మైనార్టీ వర్గాల వారు నష్టపోకుండా ఈద్గా మసీదు కాంప్లెక్స్ వివాదాన్ని అందరి ఆమోదంతో పరిష్కరించాలని పలువురు మైనార్టీ సంఘాల నాయకులు కోరారు. ఆదివారం ఆర్డీఓ కేశవనాయుడు, రెవెన్యూ, సర్వే అధికారుల ఆధ్వర్యంలో మసీదులో సమావేశం జరిగింది. ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుని ఎవరికి అన్యాయం జరగకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వం ఒకవేళ కూల్చివేతకు వెళ్తే నష్టపరిహారంగా రూ.9.80 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఎటువంటి హామీ ఇవ్వకపోగా చాలా తక్కువ మొత్తం పరిహారమని అనుకుంటుండటం అన్యాయమని కాంప్లెక్స్‌లో అద్దెకు ఉంటున్న వారు వాపోయారు. సమస్యను సామరస్య పూర్వకంగా పరిశీలించాలని మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్ సైఫుల్లాబేగ్, బీజేపీ ఫయాజ్, ఫిరోజ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గౌసుమొద్దీన్ తదితరులు కోరారు.

టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ

టీడీపీ సీనియర్ నాయకుడు సాలార్ బాషా, ఇతర మదపెద్దలు ముతవల్లీ షకీల్‌షఫీని నిలదీశారు. పారదర్శకంగా ఉండేందుకే తామూ ప్రయత్నిస్తున్నామన్నారు. షాపుల వారికి న్యాయం చేయడం మాని మసీదు నిర్వాహకులమని చెప్పుకుంటున్న వారు రోజుకో ఒక మాట చెప్పుకోవడం తగదన్నారు. ప్రభుత్వం చెబుతున్నట్టు కాంప్లెక్స్ గదులు కొట్టేస్తే దానిపై ఆధారపడిన వారు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అందరూ ఒకే మాటపై నిలబడాలన్నారు. టీడీపీ నాయకుల మధ్యే వాగ్వాదం చోటు చేసుకోవడం అధికారులను కూడా విస్మయానికి గురి చేసింది.

స్వామియే శరణం అయ్యప్ప



అయ్యప్ప చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



హారతి తీసుకుంటున్న మహిళలు



అయ్యప్ప స్వామికి జ్యోతులు మోస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్: స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో నగరం మార్మోగుతోంది. నగరంలో వివిధ చోట్ల జరుగుతున్న అయ్యప్ప స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక చెరువు కట్టపై మాలధారణ చేసిన వారు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ నేతృత్వంలో పలువురు భక్తులు స్వామి నామస్మరణ చేస్తూ అగ్నిగుండాన్ని దాటారు. అలాగే ప్రధాన ఆలయంలో స్వామికి కలశాభిషేకం, భూతబలి జరిగాయి. సామూహిక అన్నప్రసాద వితరణ జరిగింది. స్థానిక అశోక్ నగర్‌లోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం ఆధ్వర్యంలో భారీ ఎత్తున నగరోత్సవం నిర్వహించారు. దీపజ్యోతులు, వివిధ వేషధారణలతో ఉత్సవ వేడుకలు కమనీయంగా సాగాయి. వివిధ దేవతామూర్తుల మాలధారణ చేసిన భక్తులు ఊరేగింపులో భక్తిగీతాలు ఆలపించారు. అయ్యప్ప మాలధారులు చేసిన భజన అందరినీ ఆకట్టుకుంది.

ఆదర్శప్రాయుడు పప్పూరు రామాచార్యులు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం కల్చరల్: స్వాతంత్య్ర సమరయోధుడిగా, పత్రికా సంపాదకుడిగా అనంత వాసుల్లో చైతన్యం తీసుకొచ్చిన పప్పూరు రామాచార్యులు ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక జడ్జి బంగ్లా ఎదుట ఉన్న పప్పూరు రామాచార్యుల విగ్రహం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన నిచ్చెనమెట్లను మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పప్పూరు రామాచార్యుల జయంతి వర్ధంతుల సందర్భంగా విగ్రహం వద్ద నిచ్చెనమెట్లు లేకపోవడంతో జిల్లా కలెక్టర్, మున్సిపాలిటి వారి దృష్టికి తీసుకెళ్లగానే స్పందించడం ఆనందంగా ఉందన్నారు. పప్పూరు రామాచార్యుల త్యాగమయ జీవితాన్ని ఈతరం వారికి పరిచయం చేయడానికి స్మారక కమిటీ కృషి సాగించాలన్నారు. అనంతరం పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పప్పూరు రామాచార్యుల మనవడు విజయ్‌కుమార్, మనవరాలు సుజాత, ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, పప్పూరు రామాచార్యుల స్మారక కమిటీ చైర్మన్ నాగలింగయ్య, డాక్టర్ నాగేంద్ర, పూజారి ఈరన్న, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కమ్మన్న, శ్రీనివాసులు, జిరసం అధ్యక్షులు డాక్టర్ జెన్నే ఆనంద్, కవులు మధురశ్రీ, షరీఫ్, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: మండలంలోని బొమ్మేపర్తి, లింగనపల్లి, పుల్లరేవు, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి, రామినేపల్లి, హంపాపురం, గొల్లపల్లి, మరూరు, ఎం.కృష్ణాపురం, ఎం.చెర్లోపల్లి, పాలవాయి, ఎం.బండమీదపల్లి, పర్వతదేవరపల్లి, ముక్తాపురం తదితర గ్రామాల్లోని భారత్ గ్యాస్ వినియోగదారులకు సోమవారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈనెల 10వ తేదీ వరకూ భారత్, హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు రాప్తాడులోని పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంట గ్యాస్ సిలిండర్లను అందజేయనున్నారు. మరింత సమాచారం కోసం 08554–286777 (భారత్ గ్యాస్), 08554–246199 (హాసిని ఇండేన్ పవన్ గ్యాస్), 08554–228789 (హనుమాన్ హెచ్‌పీ గ్యాస్)లో సంప్రదించవచ్చు.

డ్రెస్సింగ్ రూంకు మోక్షమెప్పుడో?



డ్రెస్ మార్చుకునేందుకు డోర్ కర్టెన్ ఏర్పాటు చేసుకున్న దృశ్యం

- ఇబ్బందులు పడుతున్న స్టాఫ్‌నర్సులు

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో స్టాఫ్‌నర్సుల పరిస్థితి దయనీయంగా మారింది. మహిళలు ఆకాశంలో సగం.. మహిళా సాధికారత, మహిళలకు పెద్దపీట వేస్తామంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశాల్లో, సభల్లో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తారు. కనీసం మహిళలకు ప్రాథమిక వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని గైనిక్, లేబర్‌కు సంబంధించిన నాలుగు యూనిట్లలో స్టాఫ్‌నర్సులకు డ్రెస్సింగ్ రూం లేకపోవడం గమనార్హం. కేవలం ఒక అల్మారాకు, కిటికీకి అడ్డంగా తాడు, కర్టెన్ వేసుకుని అవస్థలు పడుతున్నారు. గత ఏడాదిగా ఇదే సమస్యతో స్టాఫ్‌నర్సులు అవస్థలు పడుతున్నారు. రౌండ్ ద క్లాక్ సేవలందించే స్టాఫ్ నర్సులపై గైనిక్ విభాగం వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గదులున్నా.. వీరికి కేటాయించడంలో జాప్యం చేస్తున్నారు. ఇదెలా ఉన్నా కనీసం అల్యూమినియస్ షీట్లతో ఐదు అడుగుల చిన్నపాటి గదిలా ఏర్పాటు చేయడానికి రూ.లక్షలు కూడా అవసరం లేదు. కేవలం తక్కువ మొత్తంతోనే స్టాఫ్‌నర్సులకు గది ఏర్పాటు చేయవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వ సర్వజనాస్పత్రి వైద్యులు కనికరిస్తారో లేదో వేచి చూద్దాం.

– అనంతపురం మెడికల్: